
# కారణజన్ముడు

## ఇంద్రగంటి శ్రీకాంత శర్మ



''విన్నావా?''–

అన్నాడు కలిదిండి చినసూరపరాజు.

''లేదయ్యా''–

అన్నాడు అబ్బులు అనబడే వీరభద్రం.

''ఇలాంటివి ఆలస్యంగానైనా మనకి తెలిస్తే మేలేకదూ?'' – అన్నాడు మళ్లీ చినసూరపరాజు, తను చదివే సంస్కృత భారతం శాంతిపర్వం పేజీ లోకి వేలుపోనిచ్చి, ఆ గుర్తుతో పాటే తాత్కాలికంగా పుస్తకం మూసి–

''చిత్తం'' – అన్నాడు వినయంగా అబ్బులు–

అబ్బులేం ఖర్మ! ఆ వూళ్లో అందరూ తరతరాలుగా కలిదిండి వారి కుటుంబం ముందు ''చిత్తం'' అంటూ బతుక్కుంటూ వస్తున్న వారే!–

చినసూరపరాజు తన సంభాషణ కొనసాగించాడు:

''తనింక ముప్ఫైరోజుల్లో చనిపోతాననగా, కురుక్షేత్రంలో శవాలమధ్య కొనవూపిరితో బతికున్న భీష్ములవారు, ధర్మరాజులుంగారికి, 'నస' మానేసి పరిపాలన సంగతి చూడమని, నెత్తి మీద మొట్టిమరీ, రాజనే వాడు, ప్రజలనెలా పాలించాలో ఖండితంగా చెప్పాడు''.

''ఆయ!?'' అన్నాడు అబ్బులు ఆశ్చర్యాన్నీ, కుతూహలాన్నీ కలబోసి–

''పెద్దాయనకదండీ, కుటుంబానికీ!'' అని కూడా కొస అందించాడు–

''అదికాదు అసలు రహస్యం. ఆయన సుక్షత్రియుడు'' – అన్నాడు చినసూరపరాజు కళ్లు మెరుస్తూండగా–

''తమరు మాత్రం?'' అన్నాడు అబ్బులు ఆ సమయంలో ఏమనాలో తెలియక!

చినసూరపరాజు ఒక వెర్రి నవ్వు నవ్వాడు – ''నేనే క్షత్రియుణ్ణయితే, ఇహ దేవుడు లేడు''–

ఆయన 'గిలి'కి కారణం తెలియక మాట్లాడ కూరుకున్నాడు అబ్బులు.

ఆయన మళ్లీ అందుకున్నాడు.

''ఈలోకం – అనగా – సమాజం ఉంది చూశావూ, ఇది దండనకి మాత్రమే లొంగివస్తుందట. స్వయంగా పరిశుద్ధంగా వుండే మనుషులుండడం దాదాపు అసంభవమన్నాడు. దండనకి భయపడ్డం వల్లనే మనుషులు నీతిగా వుంటారట!''

''అదండీ మరి! చూస్తన్నాంగదండీ! ధర్నాలకీ, నిరాహారదీక్షలకీ, రాస్తారోకోలకీ,

వినతిపత్రాలకీ, మీటింగుల్లో అరుపులకీ, అసెంబ్లీల్లో గలాటాలకీ, అభిప్రాయ సేకరణలకీ, మానవ హక్కుల సంఘాలకీ, సచ్చు సన్నాసి పబ్లికు ఇంటరెస్టు పిటిషన్లకీ, సమాచారహక్కు సట్టాలకీ, వరకట్న నిషేధాలకీ, ఫ్యామిలీ కోర్టులకీ – హోలు మొత్తంగా, ప్రెజా స్వామ్యానికీ – యెవ్వడూ భయపడ్డండి. ప్రెభుత్వంలో వున్నోడు మొదలు, ప్రజల సొమ్ము మింగేసిన ప్రతివోడూ – 'నిరూపిస్తే రాజీనామాసేస్తా'నంటూ ప్రెకటనలండి! – ఎవుడూ నిరూపించకుండా జాగర్త పడగలమన్న ఎదవ ధీమా అండి – అలాక్కాక, నాలుగు తగల్నిచ్చి, సావుకి యెడితే, ప్రతీ వోడూ దిగొస్తారండి నాకొడు... ఒద్దండి, బూతు మాటలొస్తాయి...''

అక్కసు వెళ్లగక్కాడు అబ్బులు.

''అది గదీ! – ఇప్పుడు నువ్వు మండిపడ్డ మాటల వల్ల, భీష్ముల వారు సెలవిచ్చిన మరో మాటవల్ల, నేనేం చెయ్యాలో తెలిసింది!'' – అన్నాడు చినసూరపరాజు.

''భీష్ములవారేవన్నారో!''–

చినసూరపరాజు, ఇందాక శాంతిపర్వంలోకి పోనిచ్చిన వేలుతో పాటు, ఆ పేజీ తీశాడు.

''ఇదిగో – శ్లోకం విను:

వినశ్యమానం ధర్మం హి
యో ఽ భిరక్షేత్ స ధర్మవిత్!
న తేన ధర్మహాని స్స్యాత్
మన్యుస్త న్మన్యు మృచ్ఛతి!!'' –

''అర్థం చెప్పండి''–

''దుర్మార్గుల వల్ల నశించిపోయే ధర్మాన్ని కాపాడినవాడే, ధర్మాన్ని తెలిసిన వాడు. అలా కాపాడే సందర్భంలో , హింస చెయ్యక తప్పదంటే, దాన్ని చేసే తీరాలి. ధర్మం తప్పినట్టు కాదు. అక్కడ తలెత్తిన క్రోధం, ఆ క్రోధాన్నే పొందుతుంది''–

''అంటే?''

''ఒక చెడ్డవాడు తన దుర్మార్గం ద్వారా నీకు తట్టుకోలేనంత కోపాన్ని కలిగిస్తే – నీకు కోపం కలిగించినందువల్లే, చస్తాడు – అని''

''శబాసు – దెబ్బకి దెబ్బ'' – అనేసి,

అబ్బులు మెచ్చుకోలు ఆపి – ''ఇంతకీ ఇదంతా తమరు నాకెందుకు చెప్పినట్టు?'' అని సందేహం వెలిబుచ్చాడు.

''నేను ఇప్పుడు క్షత్రియుణ్ణి కాదలిచాను''

''తమరు క్షత్రియులు కాదని యెవరన్నారు? యెప్పుడో భీష్ముల వారు ఏదో అన్నారని ఇవాళ మీరు...''

''నోరుముయ్యి. క్షత్రియుడంటే అర్థం తెలుసా? ప్రజల జీవితం దెబ్బతింటూంటే, ఆ దెబ్బనించి కాపాడే వాడే సుక్షత్రియుడు''.

అబ్బులు భయపడుతూనే అడిగాడు.

''ప్రజలంటే మీ ప్రజలా? మా ప్రజలా అయ్యా?''

''ఏరా అబ్బులూ, నువ్వు కమ్యూనిస్టువా ఏం?''


''పాతాళభైరవిలో తోటరాముడిలాగ అడిగాననుకోకండి; నిజం చెప్పమంటారా? అబద్ధం చెప్పమంటారా? అయ్యా!''

''తెలివికి సంతోషించాం గాని, నిజమే చెప్పు''.

''కమ్యూనిస్టునే అవుదామనుకున్నానుగాని, పోలీసోళ్లు చంపేస్తారేమో నని భయపడి తమదగ్గిరే ఉండిపోయానండి''–

చినసూరపరాజు ఎప్పుడూ చూడనంత జాలిగా అబ్బులుకేసి చూసి–

''ఒరేయ్ అబ్బులూ – నేనూ నిజం చెప్తున్నా. మనం ఇళ్లల్లో పెద్దవాళ్లని ''చూడడం'' మన బాధ్యత అంటూంటాం కదా! వాళ్ల ఆరోగ్యంగా, అందరితోపాటు, సొంతపనులు చేసుకుంటూ తిరుగుతూంటే మనం ''చూసినట్టు'' కాదుకదా! అనారోగ్యంతో మంచానపడినప్పుడే ''చూడ డం'' అనిపించుకుంటుంది; అవునా? – అలాగే ప్రజలంటే, నిత్యావసరాలు గడవక బాధలు పడే వాళ్లే, వాళ్లే ప్రజలు. కలిదిండి వారి కుటుంబాన్ని ఎవరూ చూడక్కరలేదు. వాళ్ల



డబ్బే వాళ్లని చూసుకుంటుంది. కాని, ఇదిగో ఈ అబ్బులు లాంటి వాళ్లని రక్షించడానికి సుక్షత్రియులు కావాలి''–

చినసూరపరాజు తనని వేళాకోళం చేస్తున్నాడా? అని అబ్బులికి క్షణం సేపు కోపం కలిగినా తమాయించుకున్నాడు అయితే – వినయంగానే, ఇలా అన్నాడు.

''తమరు సుక్షత్రియులు కావడానికి ఏం చెయ్యబోతున్నారు?''

''సన్యసించబోతున్నా''.

అబ్బులనే వీరభద్రానికి ఒక్కపెట్టున నవ్వొచ్చింది.

***

కలిదిండి వారంటే, పేరు ప్రతిష్ఠలు గల రాచకుటుంబం. ముగ్గురన్న దమ్ముల మధ్య వాటాలు పడగా – గోదావరి కింద ముప్ఫై ఎకరాల మాగాణి, పాతికెకరాల కొబ్బరితోట చినసూరపరాజు వాటాగా వచ్చాయి. సూరపరాజుకి ఒక చెల్లెలుంది మంగతాయారు. ఆమె భర్త సూర్యనారాయణరాజు ఇల్లరికం వచ్చాడు. పేరుకి పొలం, తోట, చినసూరపరాజుది కాని, నిర్వహణంతా సూర్యనారాయణరాజుదే. ధర్మాత్ముడనీ, పేదలపెన్నిధి అనీ పేరుపడి, రాజకీయాల్లో జిల్లా స్థాయిలో నిలదొక్కుకుని – కులాల కుమ్ములాటల్లో తల దూర్చడం ఇష్టంలేక, ఆధ్యాత్మిక రంగం వైపు మళ్లి, గురువులు, పాదపూజలు, దేవాలయ ధర్మకర్తృత్వం వంటి కార్యక్రమాలలో స్థిరపడ్డారు.

కలిదిండి పెదసూరపరాజుగారి మనుమడు ఈ చినసూరపరాజు, బావగారి అజమాయిషీ కింద ఆస్తి వదిలి, నలభై సంవత్సరాలకి కొంచెం తక్కువ వయస్సు దాకా, రాచ విలాసాల్లోనే గడిపాడు. సూర్యనారాయణ రాజు అతన్ని దిద్దడానికి కొంత ప్రయత్నం చేసి – అతని భార్య ముగ్గురు పిల్లల్నీ, తన భార్య ఒక్క కొడుకునీ, నియమ నిష్ఠలతో కాపాడడంలో నిమగ్నమయ్యాడు.

చినసూరపరాజు చెడ్డవాడనడానికేమీ దాఖలాలు లేవు. ఆస్తులమ్మలేదు. అప్పలు చెయ్యలేదు. సాలీనా తనకొచ్చే ఆదాయం నుంచే ఖర్చు చేస్తూ తిన్నాడు. తాగాడు. తిరిగాడు.

తిరగడం వైదేహి అనే వేశ్యతో సందర్భపడింది. సూర్యనారాయణరాజు ధర్మకర్తగా ఉన్న ఆలయం వేణుగోపాలస్వామిది. ఆలయానికి నూర్రేళ్ల పైగా చరిత్రవుంది. అక్కడ ధనుర్మాసోత్సవాలు, కృష్ణాష్టమి బాగా చేస్తారు. ఆ ఆలయానికి చెందిన ఒక దేవదాసీ కుటుంబంలో అమ్మాయి వైదేహి. 'కలాప' నృత్యంలో ఆమె అద్భుతాలు చేసేది. చినసూరపరాజు ఇహ తట్టుకోలేక వాళ్లింటికి వెళ్లిపోయాడు. చినసూరపరాజు, నవ మన్మధుడు కాకపోయినా, హద్దులెరిగిన సరసుడు కావడం వల్ల వైదేహి మొహమాట పడిపోయింది.

అంతా, వైదేహి వలలో చినసూరపరాజు పడిపోయాడని చెప్పుకున్నారు. కొంతకాలం చెప్పుకుని, ఉత్సాహం తగ్గగానే ఆగిపోయారు.

వైదేహి సావాసం వల్ల ఏదైనా ఒరిగివుంటే, అది చినసూరపరాజుకే ఒరిగింది. వైదేహికి సంస్కృతం బాగా వచ్చు. నాట్యశాస్త్రం, అభినయ దర్పణం, నృత్తరత్నావళి వంటి నాట్యశాస్త్ర గ్రంథాలే కాక, భారత రామాయణాలు, సంస్కృత కావ్య నాటకాలూ కూడా ఆమె యింట్లో వుండేవి. సరదాపుట్టి ఆమె ద్వారా సంస్కృతం నేర్చుకున్నాడు. చినసూరపరాజుకి అంతవరకు ఇంగ్లీషు భాషలో నవలలూ, కథలూ చదవడమే వ్యసనం. వైదేహిని వెంట వేసుకుని దేశంలో తిరిగినప్పుడూ, ఆమె నాట్య కార్యక్రమాలు వెంట తాను తిరిగినప్పుడూ, తెగ పుస్తకాలు కొనేవాడు. అప్పుడే కమ్యూనిస్టు సాహిత్యం బాగా చదివాడు. మహోద్రేకం కలిగేది. ఒకవైపు కుటుంబ సంప్రదాయం, సూర్య నారాయణరాజు రాజకీయ జీవితమూ, మరొకవైపు వైదేహి ఆకర్షణ – యీ కారణాల వల్ల ఏర్పడిన అలసత్వం – కారణంగా, కలిదిండి చినసూరపరాజు ఆంధ్రదేశపు జనాభాలో ఒకడుగా మాత్రమే, ఈ సదరు వయస్సు వరకు క్రియాశీలి కాలేక పోయాడు.

ఏడాదిక్రితమే ఒక దారుణం జరిగింది. వైదేహీ, తల్లీ, అరసవిల్లి సూర్య దేవాలయం చూసి, తిరిగి వస్తూండగా, రైల్లో దోపిడి జరగడం, పెనుగులాటలో దుండగులు ఆమెను, తల్లిని, చంపేయడం సంభవించాయి.

చినసూరపరాజు మానసికంగా దెబ్బతినేశాడు. ఇంతకాలం తన ప్రపంచంలో తను బతుకుతున్న అతనికి ఒక్కసారి లోకం అంటే ఏమిటో అర్థమైంది. సరిగ్గా – ఈ రోజుల్లోనే అబ్బులు అనే వీరభద్రం, అతని కళ్లలో పడ్డాడు. నిజానికి అబ్బులు సూర్యనారాయణరాజు మనిషి. కొబ్బరికాయల వ్యాపారి. ఒకరకంగా ఏజెంటు కూడ. చమత్కారి. మాటకారి. హాస్యప్రియుడు. బావమరిది మనస్సు బాగా లేకున్నాడని, ఆయన అబ్బుల్ని చినసూరపరాజుకి పరిచయం చేశాడు.

అబ్బులు సావాసంలో కలిదిండి చినసూరపరాజు తన మనోవేదన నుంచి కోలుకున్నాడు. తీరిక దొరికినప్పుడల్లా తాను వైదేహి ఇంటినుంచి తెచ్చుకున్న పుస్తకాలు చదువుకుంటున్నాడు.

అప్పుడప్పుడు వైదేహి – ''మీరు రాజులు కదా! శాంతిపర్వం చదవండి'' అని పోరుతూండేది. ఇంగ్లీషు నవలల మీద ఉండే రుచి, భారతం మీద ఉండేది కాదు.

అబ్బులు ద్వారా జీవితం గురించి, దాని దుర్భరత్వం గురించి, కథలు కథలుగా విన్నాడు–

ఉండి ఉండి, సూర్యనారాయణరాజు పాతరాజకీయ పరిచయాలు తవ్వుకుని కాంట్రాక్టుల్లోకి దిగాడు. రోడ్లు, బిల్డింగులు, ఇరిగేషను, రైల్వే – ఒకటేమిటి? – ఎంతగా డబ్బుతో విస్తరించాలో, అంతగానూ విస్తరించి – ''బుద్ధికుదిరిన'' చినసూరపరాజుకి అబ్బుల్ని సాయమివ్వడమే కాకుండా, వ్యవసాయపు పనంతా అప్పగించాడు. సూర్యనారాయణ రాజు మాత్రం సకుటుంబంగా హైదరాబాదుకి ఎదిగిపోయాడు. అతడి భాషే మారి పోయింది. అయితే – రాజకీయాలలోకి తలదూర్చకుండా కేవలం వ్యాపారవేత్తగా ఉండడానికే నిర్ణయించాడు.

పార్టీలు కాదు; పని జరగడం ముఖ్యం; అనే ఏకైక సిద్ధాంతాన్ని నమ్ముకున్నాడు – మరీ పైకొచ్చాడు.

ఆ రోజున చినసూరపరాజు, సుక్షేతియడనిపించుకోదలచి, ''సన్న్యసిస్తా'' అన్నప్పుడు, అబ్బులు ఒక్కపెట్టున నవ్వడానికి గట్టికారణమే వుంది.

చినసూరపరాజులో చైతన్యస్రవంతి ఉరకలెత్తడానికి సరిగ్గా పది రోజుల ముందే, ఒక విశేషం జరిగింది.

సూర్యనారాయణరాజుకి, స్వకుటుంబం నుంచి అచ్చంగా 'నా' అనుకోదగిన మనిషి, ప్రభుత్వపు పార్టీ ద్వారా, శాసనసభా ప్రవేశం చేస్తే లాభసాటిగా వుంటుందని విశ్వాసం కుదిరింది. కాలం మారింది. మడిగట్టుకుంటే మన పనులు కావనే జ్ఞానోదయమైంది.

జనానిదేం వుంది. మందగానం – ఇవాళ 'ఛీ' అన్నా ఓర్చుకోగలిగితే, రేపు వాళ్లే 'జై' అనే లాగ మలుచుకోవచ్చు.

తలచిందే తడవుగా రాజుగారు, బావమరిది దగ్గరికి ప్రయాణం కట్టి వాలేరు. ఎన్నికలలో నిలబడడాని కవసరమైన 'తయారుతిండి' అతని చేత తినిపించడం ఆ పర్యటన లక్ష్యం.

రెండు రోజుల పాటు యావత్తు భారతదేశ రాజకీయ చిత్రపటాన్ని పరిచి చూపించి – మృదుమధురంగా నచ్చచెప్పారు. చిన్నచిన్న ఊళ్లు చెడి పోతున్నాయని వాపోయారు. మేలుకొమని ప్రబోధించారు. వ్యవ సాయానికిక రోజులుకావన్నారు. 'కార్పొరేట్ కల్చర్'లో ప్రవేశించడం అనివార్యమన్నారు. తొలి అడుగు హైదరాబాదువైపు వెయ్యమన్నారు. చిలక్కిచెప్పినట్టు చెప్పారు. అరటి పండొలిచినట్టు చేతిలో పెట్టారు. ఆయా సందర్భాల్లో అబ్బులు కూడా చినసూరపరాజు పక్కనే వుండి, అక్షరాక్షరం విన్నాడు – రాజుగారి తాపత్రయం చూసి, ''తప్పేం వుంది? బావమరిది మేలుకోరే కదా చెపుతున్నాడు'' అనుకున్నాడు.

కాని – చినసూరపరాజుకి, బావగారి ప్రతిపాదనల్లో తెలివి తెలిసి వచ్చింది. తన కాళ్లకింద ఒక అగాధం ఏర్పడబోతోందని భయం వేసింది.

చిన్నచిన్న ఊళ్లు చెడిపోవడమంటే ఏమిటి? వ్యవసాయం పనికి రాక పోవడం ఏమిటి? నేనెందుకు కార్పొరేట్ కల్చర్‌లోకి వెళ్లాలి? – అనే ప్రమాదకర ప్రశ్నలు తలెత్తాయి. మొగమాటం లేకుండా పైకి అడిగేసి, "I am not interested" అని ఖండితంగా చెప్పేశాడు.

ఆ క్షణంలో అబ్బులుకి చినసూరపరాజు అజ్ఞానిగానే అనిపించాడు.

సూర్యనారాయణరాజు గారు తొణకలేదు. బెణకలేదు. చిరునవ్వు నవ్వి –

''నాకు తోచింది చెప్పాను – నీ యిష్టం'' అనేసి హైదరాబాదు వెళ్లిపోయారు.

''ముండని మరిగినోడు, పుస్తకాలు మరిగినోడు, ఇంతకంటె ఏం చేస్తాడులే'' అని అబ్బులు ఆక్రోశించాడు.

అదీ – అబ్బులనే వీరభద్రం ఒక్క పెట్టున నవ్విన కథ–

''ఏం బాబూ? అంతగా నవ్వేవు?'' అన్నాడు వ్యంగ్యంగా చినసూరప రాజు.

''రాజులకి సన్న్యాసం లేదంటారు గదా అని–''



## టెన్షన్ తట్టుకోలేకపోతోందట!

'కొమరం పులి' విడుదల విషయంలో జరుగుతున్న జాప్యంపై మిగతా వారి మాట ఎల్లా ఆ సినిమా హీరోయిన్ మాత్రం టెన్షన్ తట్టుకోలేకపోతోందట! ఈ సినిమా మీద నికిషా చాలా ఆశలేపెట్టుకుంది. ఒక్కరాత్రిలో తనని స్టార్ హీరోయిన్‌గా చేసే సత్తా ఈ సినిమాకు ఉందని నిఖిషా నమ్ముతోంది. నికిషా ఆశలు నిజం అవుతాయో...లేక కల్లలే అవుతాయో మరి కొద్ది రోజులు ఆగితే తప్ప తేలదు...ఈ లోపు టెన్షన్ కంట్రోల్ చేసుకోలేకపోతే సమస్యలు తప్పవని సినీ పండితులు హెచ్చరిస్తున్నారు.

వివరించాడు అబ్బులు.

''సన్యాసమంటే ఏమిటో తరవాత నీకే తెలుస్తుంది గాని, – అబ్బులూ, నువ్వు మా లోగిట్లోకి ఎలా వచ్చావో గుర్తుందిరా?''

''ఆయ! తమ బావగారే తీసుకొచ్చారండి''.

''పదేళ్ల క్రితం – అవును కదా! అంతకు పూర్వం ఎక్కడున్నావు? ఏం చేశావు? గుర్తుందా?''

''ఆయ! ఎందుకులేదండి! తమరు ఎరగనిదే వుంది? – నాతో చెప్పించాలని కాకపోతే...''

''వింటా, మళ్లీ చెప్పు''

''అబ్బయ్య చౌదరిగారి బియ్యం మిల్లు గుమస్తాని''

''కదా! మా రాజుగారెందుకు తెచ్చారో!''

''తెలివైన వోణ్ణని అనుకుంటానండి''

''నేనూ నిన్ను గురించి అదే అనుకుంటున్నాను. చూడు అబ్బులూ, నీకు తెలియని ఒక సంగతి చెప్తా విను. సూర్యనారాయణరాజు గారు కూడా నీలాగే మా పెదమామయ్యగారి జనపనార మిల్లులో గుమస్తా. పరువు కోసం మానేజరు అనే వారు. మా నాన్నగారు వారి సమర్థత గురించి, ఇల్లరికానికి తెచ్చారు. వారు ఇంతవారయ్యారు. వారు తీసుకొచ్చిన నువ్వు, ఇంకెంతవాడివి కావాలో... కదా!''

అబ్బులనే వీరభద్రం ముఖం చిన్నబోయింది–

''తప్పయిపోయిందండి. నవ్వ కూడదండి''

''తెలిసింది కదా! చాలు. నువ్వు ఒకప్పుడు ట్రేడ్ యూనియన్లలో తిరిగిన వాడివని నాకు తెలుసు. నువ్వు కమ్యూనిస్టువి ఎందుకు కాలేదో, కాలేవో కూడా నాకు తెలుసు. లెనిన్‌గారి పేరు విన్నావా?''

''ఆయ! రష్యాలో సామ్యవాదం తెచ్చినాయన''

''రైట్ – ఆయనొక విలువైనమాట చెప్పాడు. మనం మనమున్నస్థితి నించి పది మెట్లు కిందికి దిగి, కిందనున్న వాడికి చెయ్యందించామంటే, మనం దిగబడి పోయామని అర్థం కాదు; కిందవాడిని పైకి లాగడానికే!''

''గొప్పగా అన్నారండి''

''కదా! – నీ లాంటివాడు, నాలాంటివాడు – అసలు మనిషన్నవాడు చెయ్యాల్సిన పని అదీ – పై పైకి వెళ్లే సందడిలో కింద వాళ్లని తొక్కెయ్యకూడదు. ఇప్పుడు మీ రాజుగారు నన్ను చెయ్యమంటున్నదదే! పరిష్కారం కోసమే భారతం శాంతి పర్వం తీశాను. తక్కున దొరికింది!''

''ఆయ! సన్యాసమే గదండీ!''

''అవును. వెళ్లి నీ పని చూసుకో''

కలిదిండి చినసూరపరాజు ఆంతర్యం ఏమిటో, అబ్బులనే వీరభద్రానికి అర్థం కాలేదు.

***

ఊరూ వాడా ఏకమైపోయింది. మంగతాయారు ఫోనులో ఏడవగానే, జంటగా చినసూరపరాజు భార్య గొంతు కూడా వినపడడమే తరవాయి; – సూర్యనారాయణరాజు, కలిదిండి వారి లోగిట్లో వచ్చి వాలేడు.

చినసూరపరాజు సన్యాసుల్లో కలిసిపోయాడన్న వైనం జిల్లా అంతటా తెలిసిపోయింది. పత్రికల వారి భాషలో చెప్పాలంటే ''విషాదచ్ఛాయలలముకున్నాయి''

గుండెరాయి చేసుకుని, సూర్యనారాయణరాజు కలిదిండి వారి ఇంటి వ్యవహారాలన్నీ చక్కదిద్దాడు. చినసూరపరాజు అన్న, తమ్ముడు కూడా 'మిక్కిలి' విచారించారు.

అబ్బులు అనే వీరభద్రం, సూర్యనారాయణరాజు ఛత్రచ్ఛాయలో కలిదిండి వారి ఆస్తులకు మానేజరు అయ్యాడు. చినసూరపరాజు తమ్ముడు రంగరాజు చేతిలోకి గృహ నిర్వహణ బాధ్యత వచ్చింది.

రాచరికం మారిన రాజ్యంలోలాగే, ఆ వూరి ప్రజలు కలిదిండి వారి పలుకుబడికే విధేయులుగా ఉంటున్నారు. ఇందుకు తార్కాణంగా రంగ రాజు ఎం.ఎల్.ఏ అయ్యాడు.

సూర్యనారాయణరాజు హైదరాబాదులో వ్యాపారవేత్తగా ఎదిగి 'సగుణ' అనే ఒక సంస్థ స్థాపించాడు. కుటుంబ సభ్యులు ఏదో ఒక పని పేరిట ఇండియాకీ అమెరికాకీ మధ్య ప్రయాణాలు కొనసాగిస్తున్నారు.

***

దాదాపు – పదేళ్లయిందేమో ఈ గొడవలు, మార్పులు, జరిగి –.

దేశం చెప్పలేనంత పురోగతిదిశగా ప్రయాణిస్తోందని ప్రభుత్వాలు అమాయకపు లెక్కలు చెపుతూంటే – వాటిని లక్ష్యపెట్టకుండా, ఎక్కడ పడితే అక్కడ తగాదాలూ, సవాళ్లూ – దేశ ప్రజల పరిస్థితి అధోగతిలో, దిగడానికీ మెట్లు లేకుండా వుందని, ధిక్కారాలు!!

ఎక్కడో బాంబుపేలుతుంది. కొంతమంది మరణం – ఇంకొక చోట మానవబాంబు పేలుతుంది –

రక్షణచర్యలు – ప్రతి మనిషికి సోదాలు! ఏదో చెప్పీచెప్పని యుద్ధ వాతావరణం.

హింస – ప్రతిహింస – మానవ హక్కులు – చర్చలే చర్చలు – సున్నిత – మనస్కులు గాభరా పడిపోతున్నారు.

దేశం మొత్తం శిబిరాలు శిబిరాలుగా విడిపోయి – కలిసి వున్న భ్రాంతిని కలిగిస్తోందా?

సూర్యనారాయణరాజుకి ఈ పరిస్థితి బహు విషాదంగా అనిపించింది.

రంగరాజు మంత్రి అయ్యాడు. శాఖఏదైతే యేం? – మంత్రివర్గ సమావేశంలో ప్రవేశం వుంది కద!

ఈ వాదం, ఆ వాదం, సంవాదం, ప్రతిపక్షం... తెల్లారి లేచింది మొదలు పత్రికలకి, టి.విలకి ఇదే పని–

ప్రభుత్వానికి ఒళ్లు మండింది.

మండదూ మరి! – మంత్రి రంగరాజు మీద బాంబు దాడి – చావుతప్పి కన్నులొట్టపోయిన సామెతగా, భగవంతుడి దయవల్ల ప్రాణాలతో బైట పడ్డాడు.

''చట్టం దాని పని అది చేసుకు పోతుంది'' అని కొందరు.

''ఇది పిరికిచర్య'' అని కొందరూ, ''దోషుల్ని పారిపోనిచ్చే ప్రసక్తిలేదని'' కొందరూ – నిరసనలు తెలిపారు.


నాలుగు రోజులపాటు ముమ్మరంగా తనిఖీలు జరిగాయి.

అడవి పరిసరాల్లో కూంబింగులు జరిగాయి. ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు తీవ్రవాదులు మరణించారు. వారిలో ఒకరు రాష్ట్ర కమిటీ సభ్యుడు.

అతడి పేరు కలిదిండి చినసూరపరాజు అలియాస్ వివేక్.

*

రచయిత ఫోన్ నెం: **040-27794073**



## నమిత నైట్ డ్యూటీలు...

హీరోయిన్లకు నైట్ డ్యూటీలు ఏమిటని ఆశ్చర్యపోకండి! ఎక్కడా, ఏ హీరోయిన్ చేయని విధంగా నమిత నైట్ డ్యూటీలు తెగ చేస్తోందట! 'సింహ' తరువాత నమితకు తెలుగులో ఆశించిన అవకాశాలు రాలేదు అన్న సంగతి తెలిసిందే! ఇక తమిళంలో చేస్తున్న ఒకటి రెండు సినిమాలకే ఆమెకు ఎక్కడ లేని టైము సరిపోవడం లేదట! పగలంతా చెన్నయ్, ముంబాయి షూటింగ్‌లలో పాల్గొని రాత్రి అయ్యేసరికి హైదరాబాద్ చేరుకుంటోందట! ఎందుకంటే... స్టోరీ డిస్కషన్స్ కోసం దర్శక, నిర్మాతలకి నైట్ టైమ్ ఇస్తోందట! వారు చెప్పే చెత్త కథలన్నీ రాత్రంతా వింటూ, నిద్ర లేకుండా రాత్రి సమయాల్లో కూడా వర్క్ చేస్తోందట! తిరిగి తెల్లవారి యధాప్రకారం షూటింగ్‌లలో పాల్గొంటోందట! ఇది ఏదో ఒకటి రెండు రోజుల సంగతి అయితే చెప్పుకోవలసిన అవసరమే లేదు కానీ 'సింహ' 50 రోజుల ఫంక్షన్ అయినప్పటి నుంచీ ఇదే నమిత షెడ్యూల్. నమిత ఫంక్షన్‌లో పాల్గొనడానికి వచ్చినప్పుడే ఈ షెడ్యూల్ ఖరారయిందట! అదీ సంగతి!